కథ

# ఆత్మవిమర్శ

"బాబూ ధర్మం!"

చిరాగ్గా తలతిప్పి చూశాను. తైల సంస్కారం లేని చింపిరిజుట్టు, మాసిన గడ్డం, లోతుకు పోయిన కళ్ళు, వెలిసిపోయిన చిరుగుల గుడ్డలు వార్ధక్యపు భారానికి కొద్దిగా వంగిన నడుముతో దరిద్ర దేవత మానవాకృతి దాల్చినట్టుగా — ఎదురుగా ముష్టివాడు.

నేను తనవైపు చూడగానే పలకరింపుగా నవ్వి, చేతిలోని సొట్టలు పడిన పళ్ళాన్ని ముందుకు చాపాడు.

వాడిని అక్కడ అలా చూడ్డం నాకది మొదటిసారి కాదు. రోజూ ఆఫీసుకు వచ్చేప్పుడు, వెళ్ళేప్పుడు నాకు అదే బస్‌స్టాపులో ఠంచన్‌గా ఎదురవుతాడు.

నిజానికి, నాకు ముష్టివాళ్ళంటే ఒళ్ళు మంట. ఒళ్ళొంచి కష్టపడ్డం చేతకాని ప్రతి వాడికీ ఇదొక పెట్టుబడి లేని వ్యాపారంగా మారిపోయింది. ఇలాంటి సోమరుల వల్లే దేశ పురోగతి కుంటుపడుతోందని, భూమికి భారంగా ఉండడం తప్ప వీళ్ళ వల్ల దేశానికి ఒరిగేదేమీ లేదనేది — నా ఒపీనియన్.

ఈ విషయంలో ప్రభుత్వమే కనక నన్ను సలహా అడిగి ఉంటే, దేశ ప్రగతికి సైంధవుల్లా అడ్డుపడుతున్న ఈ ముష్టి రాస్కెల్స్ అందర్నీ నిలబెట్టి మరీ షూట్ చెయ్యాలని చెప్పేవాడిని.

ముష్టివాళ్ళంటే నాకంత అసహ్యం.

అలాంటి నేను, ఎప్పుడూ అప్పులవాడిలా వెంటపడే ఈ ముష్టి ముసలాడ్ని వదిలించుకోవడానికి అప్పుడప్పుడూ చిల్లర విదల్చక తప్పడం లేదు.

అయితే, ఈసారి ఆ ముసలాడిని ఓ ఆట పట్టించాలనుకున్నాను. "ఏయ్, ముసలోడా, నీ పేరేంటి?" అన్నాను దబాయిస్తున్నట్టుగా.

"నారాయణండీ!" అన్నాడు ఎంతో వినయంగా.

"చూడూ, ఇలా పదిమంది దగ్గరా చేయి చాచి ముష్టెత్తుకోవడానికి నీకు సిగ్గుగా లేదూ? మనిషి జన్మ ఎత్తాక కష్టపడి ఏదో ఒక పని చేసుకుంటూ గౌరవంగా బ్రతకాలి తెల్సా!" అన్నాను అతడినో పురుగును చూసినట్టుగా చూస్తూ.

అలా అన్న తర్వాత నాలిక్కరుచుకున్నాను.

"ఏం పని చేయమంటారు బాబూ! పోనీ మీ ఇంట్లో ఏదైనా పనుంటే ఇప్పిస్తారా?" అని ఒకవేళ ఆ ముష్టివాడు గనక ఎదురు ప్రశ్నిస్తే నోరు వెళ్ళబెట్టాలి నేను. అదీగాక రోజులసలే బాగా లేవు. ఈ మధ్య ముష్టి వాళ్ళు కూడా యూనియన్లు పెట్టేస్తున్నారు. తనని అవమానించాడంటూ నాపై ఈ ముసలాడు పరువునష్టం దావా వేసినా ఆశ్చర్య పడనక్కర్లేదు.

కానీ, నేను భయపడినట్టుగా వాడలాంటి పనులేమీ చేయలేదు. చిన్నగా నవ్వి "బాబూ! ధర్మం!!" అన్నాడు మళ్ళీ. వాడి నవ్వులో "ఇలాంటివన్నీ నాకు అలవాటే లేవోయ్!" అన్న భావం కదలాడినట్టనిపించింది నాకు. ఓసారి చుట్టూ చూశాను. బస్‌స్టాప్‌లో ఉన్న వాళ్ళంతా మాంఛి కాలక్షేపం దొరికినట్టుగా ఆసక్తిగా మా వైపే చూస్తున్నారు.

ఇబ్బంది ఫీలయ్యాను. వాడిని ఆట పట్టించే పనికి స్వస్తి చెప్పి ప్రిస్టేజ్ కోసం అయిష్టంగానే జేబులో చేయి పెట్టాను. పావలాలు, అర్ధలు తగిలాయి చేతికి. వెతకగా, వెతకగా ఒక ఐదు పైసలు, ఒక పది పైసల నాణేలు చేతిలోకి వచ్చాయి. పది పైసల్ని జేబులోకి తోసేసి, ఐదు పైసల నాణేన్ని తీసి విసురుగా వాడి పళ్ళెంలోకి గిరాటేశాను.

వాడు కృతజ్ఞతా సూచకంగా తల కాస్త వంచి నమస్కరించి ముందుకి కదిలాడు.

"హుఁ వీడి కోసమైనా రోజూ చిల్లర మార్చి జేబులో వేసుకు రావాలి కాబోలు..." ముష్టి వెధవ" కసిగా వాడిని మనసులోనే తిట్టుకున్నాను.

ఇంతలో బస్సు వచ్చి, అలవాటు ప్రకారం స్టేజ్‌కి ఆరు గజాల ముందుకెళ్ళి ఆగినట్టే ఆగి వెంటనే కదలడంతో దాన్ని క్యాచ్ చేయడానికి పరుగందుకున్నాను.

★ ★ ★


ఆ రోజు ఫస్ట్ తారీఖు.

నాలాంటి జల్సారాయుళ్ళకి సంతోషాన్ని శాలరీ రూపంలో మోసుకొచ్చే అపురూపమైన రోజు. పాంటు జేబులోంచి కొద్దిగా తల బయటపెట్టి మత్తుగా నవ్వుతున్న పర్సుని మరోసారి ఆప్యాయంగా తడిమి చూసుకుని హుషారుగా ఆఫీసు నుండి బయటపడ్డాను.

ఎప్పటిలాగా బస్‌స్టాప్ కేసి నడవకుండా పక్కనే ఉన్న కిళ్ళీకొట్టు వైపు అడుగులు వేశాను.

త్రిబుల్ ఫైవ్ సిగరెట్ ప్యాకెట్ తీసుకుని, ఒకటి అక్కడే వెలిగించి పొగని తృప్తిగా గుండెల నిండా పీల్చుకున్నాను.

# ఐరేని శ్రీనివాస్ గౌడ్



'మిగతా రోజుల్లో ఎలాగూ తప్పదు, జేబు నోట్లతో పెళపెళలాడే ఈ రోజు కూడా వెధవ బస్సులో వేళ్లాడుతూ వెళ్ళవలసిన ఖర్మేమిటి' అనుకున్నాను పొగని విలాసంగా గాల్లోకి ఊదుతూ.

ప్రతి నెలా ఫస్టున నాకిలా సిటీ బస్సులపై చిన్న చూపు కలగడం మామూలే.

సిటీ బస్సుల్లో అవస్థలు పడలేక ఒక బైక్ కొనుక్కోవాలని ఎప్పటినుండో అనుకుంటున్నాను కానీ, జీతం డబ్బు చేతిలో పడగానే ఆ విషయం గుర్తొస్తే ఒట్టు. నాన్న బిజినెస్‌లో బాగానే సంపాదిస్తారు కాబట్టి నా శాలరీ ఇంట్లో ఇవ్వకపోతే ఇల్లు గడవదనే సమస్య లేదు. ఇంకా పెళ్ళి, సంసారం అనే జంజాటంలో ఇరుక్కోని బ్యాచిలర్‌ని కావడం వల్ల నా జీతం డబ్బుని ఎలా ఖర్చు పెట్టుకున్నా అడిగేవాళ్ళు లేరు. చేతిలో డబ్బు పుష్కలంగా ఉన్నప్పుడే లైఫ్ ఎంజాయ్ చెయ్యాలనేది నా పాలసీ. అందుకే ప్రతి నెలా మొదటి రోజు సాయంత్రం 'స్వర్గం'లో ప్రత్యక్షమౌతాను.

ఆటోని పిలిచి ఎక్కి కూర్చుని హుందాగా చెప్పాను డ్రైవర్‌తో "త్రి కేసిల్ బార్ అండ్ రెస్టారెంటుకి పోనీవోయ్!". ఆ రోజుకి నేను ప్రిఫర్ చేసుకున్న 'హెవెన్' త్రి కేసిల్!

అక్కడినుండి బార్ చాలా దగ్గరే అయినా, నడుచుకుంటూ వెళ్ళడం నామోషీ కాబట్టి ఆటోలో వెళ్తున్నాను.

★ ★ ★

"బాబుగారూ!"

ఆటో ఫేర్ చెల్లించి బార్‌లోకి అడుగు పెట్టబోతున్న నేను పరిచితమైన ఆ పిలుపుకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసి ఆశ్చర్యపోయాను.

రోజూ బస్‌స్టాప్‌లో ఎదురయ్యే ముష్టివాడు. దాదాపు పరిగెత్తుతున్నట్టుగా నావైపే వస్తున్నాడు. కాస్సేపు ఈ ప్రపంచాన్ని మర్చిపోయి స్వర్గంలో తేలిపోదామని ఇక్కడికి వస్తే ఈ దరిద్ర నారాయణుడు (అన్నట్టు వాడి పేరు కూడా నారాయణ అని చెప్పినట్టు గుర్తు) ఇక్కడ కూడా దాపురించేసరికి నా ఆశ్చర్యం కాస్తా ఆగ్రహంగా మారింది.

నేను ఆగిపోవడంతో వాడు ఆశగా నా దగ్గరికొచ్చాడు. మనిషి ఆయాసంతో రొప్పుతున్నాడు. ఇక ఆవేశాన్ని అణచుకోవడం నాకు సాధ్యం కాలేదు.

చాచి వాడి చెంపపైన బలంగా కొట్టాను.

"యూ బ్లడీ బెగ్గర్! నేను నీదగ్గరేదో అప్పు తీసుకున్నట్టుగా ఎక్కడికెళ్తే అక్కడికి నక్షత్రకుడిలా వెంట పడుతున్నావ్. మరోసారి నా కళ్ళబడ్డావో తాటొలిచేస్తాను జాగ్రత్త!" గట్టిగా వార్నింగిచ్చేసి చరచరా లోనికి నడిచాను.

"మూడ్ కాస్తా అప్‌సెట్ చేసేశాడు డర్టీ రాస్కెల్. వాడినేం చేసినా పాపం లేదు" వాడి చెంపను తాకి మైలపడిన నా చేతిని సోప్‌తో కడుక్కొని కార్నర్‌లో ఖాళీగా ఉన్న ఒక సీట్లో సెటిలయ్యాను.

బేరర్‌ని పిలిచి ఒక క్వార్టర్ బ్లూరిబండ్ జిన్, లిమ్కా, కాజూనట్స్, గ్రీన్‌పీస్, చికెన్ మంచూరియా ఆర్డర్ చేశాను. క్షణాల్లో బేరర్ జిన్, ఐస్‌క్యూబ్స్ ఉన్న బాస్కెట్, ఒక ఖాళీ



"నిన్న ఏ సినిమా కెళ్లావురా?" ప్రసాద్‌ని అడిగాడు అతని స్నేహితుడు రంగ.

"ఆ ఒక్కటీ అడక్కు" బదులిచ్చాడు ప్రసాద్.

—బి. భరద్వాజ్,
గెద్దనాపల్లి

గ్లాస్ టేబుల్‌పై నీట్‌గా అమర్చి వెళ్ళిపోయాడు, 'ఫీడ్' తీసుకు రావడానికి.

మూడు రౌండ్లలో ఒక్కటి మిగలకుండా అన్నీ ఖాళీ అయిపోయాయి కానీ, కిక్కు మాత్రం తలకెక్కలేదు. బహుశా ఇందాకటి ఇన్సిడెంట్ కారణం కావచ్చు. అందుకే, మరో హాఫ్ క్వార్టర్ తెప్పించుకున్నాను. అది కూడా ఉదరకోశంలోకి చేరుకోగానే, నిషా మెల్లగా మెదడులోకి పాకింది. బాడీలోని మిగతా పార్ట్స్‌ని కంట్రోల్ చేసే బ్రెయిన్ కాస్తా మొరాయించడంతో ఒళ్లంతా తిమ్మిరెక్కసాగింది. కళ్ళు మూతలు పడసాగాయి. సిగరెట్ వెలిగించుకుని రిలాక్స్‌డ్‌గా కుర్చీ వెనక్కి జారగిలబడ్డాను. మనసు ఐహిక ప్రపంచాన్ని వదిలి మరో లోకంలో షికార్లు మొదలు పెట్టింది.

★ ★ ★

చేతి వేళ్ళు చురుక్కుమనడంతో సుషుప్తావస్థలో నుంచి బయటపడి సిగరెట్ పీకని యాష్ ట్రేలో నొక్కేసాను.

అప్పటికి నేనొచ్చి రెండు గంటలు దాటింది. గోరువెచ్చని నీళ్ళల్లో నిమ్మకాయ చెక్కలు వేసిన డిష్ పట్టుకు వచ్చిన బేరర్‌తో బిల్ తీసుకు రమ్మని చెప్పి హాట్ వాటర్‌లో చేతులు క్లీన్ చేసుకుని పేపర్ నేప్‌కిన్‌తో తుడుచుకున్నాను.

బేరర్ తెచ్చిన 'బిల్'వైపు కేర్‌లెస్‌గా ఓ లుక్కు పారేశాను.

"హండ్రడ్ అండ్ సెవెన్టీ ఫైవ్ రుపీస్"

రెండు పచ్చనోట్లిస్తే బిల్ పోనూ మిగిలిన 'చిల్లర' బేరర్‌కి 'టిప్'గా వదిలెయ్యవచ్చునుకుంటూ జేబులో చెయ్యి పెట్టిన నన్ను ఖాళీ జేబు దారుణంగా వెక్కిరించింది. నా గుండె క్షణకాలం కొట్టుకోవడం మానేసింది. కంగారుగా అన్ని జేబులూ వెతికాను. ఊహుఁ ఎందులోనూ పర్స్ లేదు. నా మత్తు కాస్తా వదిలిపోయి ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి.

ఈడ్చి తన్నినా నా దగ్గర నలభై రూపాయలకి మించి లేవు. అది కూడా సిగరెట్ పాకెట్ తీసుకోవడానికి వంద నోటు మార్చితే ఆటో చార్జి పోగా మిగిలినవి.

బార్ మేనేజర్ తన పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకుంటే పరవాలేదు. కానీ తననో ఛీటర్ కింద జమకట్టి గొడవ చేస్తే?

ఆ ఆలోచనకే నా వెన్నులో సన్నగా వణుకు మొదలైంది. ఇలాంటి బాడ్ పొజిషన్ ఫేస్ చెయ్యాల్సి వస్తుందని కల్లో కూడా ఊహించలేదు. ఎలా? ఈ గండం గట్టెక్కాలంటే ఏం చేయాలి?

టెన్షన్‌తో నా తల్లోని నరాలు చిట్లిపోయేలా ఉన్నాయి.

★ ★ ★

బేరర్ నన్ను అనుమానంగా ఫాలో అవుతున్న విషయం కంటి చివర్లనుండి గమనించినా, అబ్జర్వ్ చెయ్యనట్టే నటిస్తూ, ఎగ్జిట్ డోర్ ప్రక్కనే ఉన్న క్యాష్ కౌంటర్ వైపు నడిచాను.

తల వంచుకొని బిల్స్ ప్రిపేర్ చేస్తున్న మేనేజర్ నన్ను చూసి మర్యాదపూర్వకంగా లేచి నిలబడి "వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ సర్" అన్నాడు చిరునవ్వుతో.

పూడుకుపోతున్న గొంతును స్వాధీనంలోకి తెచ్చుకొని నెమ్మదిగా అతడికి నా ప్రోబ్లెం ఎక్స్‌ప్లెయిన్ చేసి, రేపు తప్పకుండా వచ్చి బిల్ పే చేస్తానని చెప్పాను.

ముఖంలో రంగులు మారడంతో ఏమిటో నాకు ఆ క్షణంలో బార్ మేనేజర్ ముఖం చూడగానే స్పష్టంగా తెలిసిపోయింది. కొద్ది క్షణాల క్రితం అతడి ముఖంలో ఉన్న ప్లెజెంట్‌నెస్ మాయమై, ఆ స్థానంలో జైలు నుండి పారిపోయి వచ్చిన ఒక క్రిమినల్‌ని చూస్తున్న ఫీలింగ్ చోటు చేసుకుంది.

"అలాగే ఫరవాలేదు సార్! ముందు మీరు కూర్చోండి. పాపం ఇంటి వరకూ ఎలా వెళ్ళారు. మా కారులో మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాం!" కౌంటర్ బయటకు వస్తూ అతడు వ్యంగ్యంగా అన్న మాటలకి నా తల నేలలోకి కృంగిపోయింది.

"మిస్టర్, నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాను. పీకల్దాకా తాగి పర్సు పోయిందని చందమామ కథలు చెప్తే జాలిపడి వదిలేస్తామనుకున్నావా? పోలీసులకి అప్పగిస్తే, ఇలాంటి వెధవ పనులు మళ్ళీ చేయకుండా వాళ్ళే నీకు తగిన బుద్ధి చెబుతారు!" అతడి మాటలకి అలాంటి స్థితిలో కూడా నా కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాను.

"కంట్రోల్ యువర్ టంగ్ మిస్టర్ మేనేజర్...అయామ్ ఎ గవర్నమెంట్ ఎంప్లాయ్ బట్ నాట్ ఎ ఛీటర్, ఆటోలో వస్తూంటే పర్స్ ఎక్కడో పోయింది. నా ఆఫీస్, రెసిడెన్స్ అడ్రస్ ఇస్తాను..." అని క్షణమాగి "పోనీ మీకు అలా కూడా నమ్మకం కుదరకపోతే, మీ కుర్రాడినెవరినైనా నాతో పంపించండి. అతడికి నేను డబ్బిచ్చి..." "నాన్సెన్స్, స్టాప్ యువర్ కాక్ అండ్ బుల్ స్టోరీస్. ఏవో నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడగానే నువ్వో పెద్దమనిషివని నమ్మి మోసపోయేంత ఫూల్‌ని కాను. ఐనా, నీతో నాకు మాటలనవసరం. బేరర్, ఇతడ్ని కనిపెడుతూ

ఉండు!" నామాటల్ని మధ్యలోనే కట్ చేసి ఫోన్‌వైపు కదిలాడు మేనేజర్.

తెల్లాగ వెల్ల వేసిన గోడలా పాలిపోయింది నా ముఖం. మెల్లిగా అతడ్ని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించాను. బట్... నోయూజ్. "ఒరేయ్ హరీష్, ఇక నీ పని ఫినిష్" ఎగతాళి చేయసాగింది అంతరాత్మ. పోలీసులు రావడం, అరెస్టు చేసి జైల్లో పెట్టడం, జాబ్ నుండి సస్పెండ్ చేయడం, అందరూ అసహ్యించుకోవడం లాంటి భవిష్యత్ కార్యక్రమాలు వరుసగా కళ్ళముందు మెదిలి ఒళ్లు జలదరించింది. జాబ్ పోయినా ఫరవాలేదు. కానీ, పదిమందిలో నా పరువేం కాను. అయోమయంగా దిక్కుతోచక అటూ ఇటూ చూస్తున్న నా దృష్టి అప్రయత్నంగా బార్ వాచ్‌మెన్ ఒక వ్యక్తిని బయటికి నెడుతూ బిగ్గరగా అరుస్తున్నాడు. ఆ వ్యక్తి తనని లోపలికి వెళ్ళనివ్వమని వాచ్‌మెన్ కాళ్లావేళ్ళా పడి ప్రాధేయపడుతున్నాడు.

ఆ శాల్తీని వెంటనే పోల్చుకున్నాను. అతడు ఇందాక నాచేత చెంపదెబ్బ తిన్న ముష్టివాడు. వాడు నేను తనవైపు చూడ్డం గమనించి 'బాబుగారూ!' అని కేకేశాడు. ఇలాంటి పరిస్థితిలో వాడి కంటపడితే వాడి దృష్టిలో నేనెంత చులకనవుతాను? అందుకే వాడి పిలుపు వినపడనట్టే నటిస్తూ చప్పున తల తిప్పుకోబోతూ, అప్పుడు... సరిగ్గా అప్పుడు చూశాను.

ముష్టివాడి చేతిలో... పర్సు...బ్రౌన్ కలర్ లెదర్ పర్సు... అది... అది.. నా పర్సే నోడౌట్. నా కళ్ళు ఆనందంతో మెరిశాయి. "మేనేజర్, అదిగో బయట ఉన్నాడే ముసలాడు. వాడి దగ్గరుంది నా పర్స్. దయచేసి వాడిని లోపలికి పంపించమని మీ వాచ్‌మెన్‌తో చెప్పండిసార్!" సంతోషం పట్టలేక దాదాపు అరిచాను.

మేనేజర్ నావైపు అపనమ్మకంగా చూస్తూ, తాత్కాలికంగా ఫోన్ చేసే ప్రయత్నాన్ని వాయిదా వేసి, వాచ్‌మెన్‌కి సైగ చేశాడు.

ఆయాసంతో, రొప్పుకుంటూ గబగబా వచ్చి పర్సని జాగ్రత్తగా నాకందించాడు నారాయణ. అప్పుడొచ్చింది నాకు అనుమానం. తను వాడిని కొట్టినందుకు కోపంతో వాడు తన పర్సు కొట్టేసి ఉంటాడా? మరి కొట్టేసిన వాడు తనంతట తాను ఎందుకు మళ్ళీ నాకు తిరిగిచ్చాడు? కొట్టేయకపోతే పర్స్ మరి వాడి దగ్గరికెలా వచ్చినట్టు? నా ఆలోచనలు కళ్ళెం తెంచుకున్న గుర్రాల్లా దౌడు తీస్తున్నాయి. కొన్ని సెకన్ల ముందు ఈ ఆపదనుండి ఎలాగో గట్టెక్కితే చాలనుకున్నాను. కానీ, ఇప్పుడు పోయిందనుకుని ఆశ వదిలేసుకున్న నా డబ్బు తిరిగి కనిపించేసరికి నా మనసు వక్రమార్గాన ఆలోచిస్తోంది. పర్సు తెరిచి డబ్బు లెక్కపెట్టుకున్నాను. సరిగ్గా ఉంది.



కడుపులో ఆకలిని తట్టుకోలేని రాజు తన తల్లితో... "అమ్మా ! కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయ్ అన్నంపెట్టు" అడిగాడు.

వంటపనిలో ఉన్న తల్లి "ఒక పిల్లిని మింగలేకపోయావా !" కోపంగా బదులిచ్చింది.

—భాస్కర్ భరద్వాజ్
గెద్దనాపల్లి

"బాబూ, తమరు కిళ్ళీకొట్టుకాడ నించున్నప్పుడు ఓ ఐదు పైసలు ధర్మం చేస్తారని ఆశగా మీరున్న వేపు వచ్చాను. కానీ, తవరు ఆపాటికే అటో ఎక్కేశారు. ఎనక్కి తిరిగి ఎళ్ళబోయిన నాకు, మీ జేబులోంచి ఏదో జారి కింద పడినట్టనిపించి దగ్గరికి వెళ్ళి చూశాను. అది మీ పరుసని తెలిసి కంగారు పడిపోయాను. ఎంటనే ఏం సెయ్యాలో తోసక మీరెక్కిన ఆటో ఎనకాలే కాలి సత్తువ కొద్దీ లగెత్తుకొచ్చాను. డబ్బులు మీకు అందజేయాలనే ఒక ఆలోశనతోనే ఆయాసాన్ని గూడా లెక్క చెయ్యకుండా పరిగెత్తుకొచ్చేసాను. కానీ, తవరు నేను సెప్పేది ఇనిపించుకోకుండానే కోపంతో లోనికెళ్ళిపోయారు. తవరు బయటకొచ్చాకే ఇవ్వొచ్చని గేటు కాడే కూకున్నాను. ఇంతలో తవరు లోన ఆళ్ళతో గొడవ పడ్డం సూసి...."

అంతవరకూ ఆగకుండా మాట్లాడ్డంతో ఒక దగ్గు తెర స్వరపేటికను చిల్చుకుంటూ వచ్చి అతన్ని కుదిపేయడంతో చెప్పడం ఆపి ఆయాసంతో గసపోయసాగాడు నారాయణ.

గాజు గోళీల్లాంటి అతడి కళ్ళు తృప్తితో మెరుస్తున్నాయి.

విభ్రాంతిగా, విస్ఫారిత నేత్రాలతో రెప్పవాల్చడం కూడా మర్చిపోయి ఆతడినే చూస్తున్నాను.

అతి హేయమైన స్థితినుండి బయట పడ్డాననే ఆనందం కంటే ఎక్కువగా అతడి నిజాయితీ నన్ను కదిలించివేసింది. నేను 'ఆఫ్టాల్ ఎ బెగ్గర్' అని అసహ్యించుకున్న వ్యక్తి, ఈ క్షణంలో తన నిజాతీతో హిమాలయాలంత ఎత్తుకు ఎదిగి పోయి కనిపిస్తోంటే అతడి ముందు నేనొక పిపీలికంలా కుంచించుకుపోతున్నాను.

ఒక మనిషిని అంచనా వేయడానికి సంఘంలో అతడికున్న అంతస్థు ఒక్కటే కొలమానం కాదని, నిజాయితీ అనేది మనిషి మనస్తత్వాన్ని బట్టి ఉంటుందే కాని, గొప్ప గొప్ప చదువుల వల్లనో, డబ్బు వల్లనో రాదని, తన ఉన్నత సంస్కారంతో నిరూపించి, మూసుకుపోయిన నా కళ్ళను తెరిపించాడు నారాయణ.

అతడి మహోన్నత వ్యక్తిత్వానికి, నాకు తెలియకుండానే నా కళ్లు చెమర్చాయి.

నామరూపాలు లేకుండా చేయాలని, నిలబెట్టి కాల్చేయాలని క్రూరంగా ఆలోచించానే ఇలాంటి నిజాయితీ పరుడి గురించా? నిజానికి దేశ ప్రగతికి అడ్డుపడుతున్నది, నారాయణ లాంటి ముష్టివాళ్లా, లేక నాలాంటి తాగి తందనాలాడే జల్సారాయుళ్ళా?

ఏసి రూముల్లో కూర్చొని ఏవో కొన్ని కాగితాల్ని కెలికినందుకు జీతం రూపంలో ప్రభుత్వం ఇచ్చే డబ్బుని విచ్చలవిడిగా తాగుడికి తగలేసే నేను దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాను? సాటి మనిషి కష్టాల్లో ఉండి అభిమానాన్ని చంపుకొని చేయి చాచి యాచిస్తే, పావలా పైసలు ధర్మం చేయడానికి గింజుకు చచ్చే నాబోటి 'ఘరానా మనుషులు' యజమాని ఇచ్చే జీతానికి తమ డ్యూటీ తాము చేసే స్టార్ హోటళ్ళలో బేరర్లకి 'టిప్పు'ల పేరిట నోట్లని విసుర్తారే దానిని ఏ రకమైన దేశ సేవగా పరిగణంచాలి?

నాలో ఆత్మ విమర్శ మేల్కొంది. నా కళ్ళకిప్పుడు నారాయణ ముష్టి వాడిగానో, అనాకారిగానో కనిపించడంలేదు. లోకంలో ఇంకా మిగిలి ఉన్న నీతినిజాయితీలకు ప్రతీకగా కనిపిస్తున్నాడు. అప్రయత్నంగా అతడికి చేతులు జోడించాను.

అదే క్షణాన నా అంతరంగం లోతుల్లో ఒక ఆలోచన నెమ్మదిగా ఊపిరి పోసుకుంటోంది.

పేదరికం కోరల్లో చిక్కి ఇటు సాటి మనుషుల ఛీత్కారాలకు అటు ప్రభుత్వ నిరాదరణకు గురవుతూ జీవచ్ఛవాల్లా బ్రతుకులు వెళ్ళదీస్తున్న నారాయణ లాంటి వాళ్ళ జీవితాలకొక వెలుగుబాట చూపించడానికి నేను ప్రతినెలా తాగుడికి ఖర్చుపెడుతున్న డబ్బుని వినియోగించాలని దృఢంగా నిర్ణయించుకున్నాను.

ఆ ఆలోచనతోనే, నాలో అంతకు ముందెన్నడూ కలగని ఒక రకమైన ఉత్తేజం, ఉద్వేగం నన్నెంతో ఉద్దీపితుడ్ని చేశాయి.

పట్టుదలతో నా పెదాలు బిగుసుకున్నాయి. అప్పటికి తన పొరపాటు గ్రహించిన మేనేజర్ మళ్ళీ ముఖంలో రంగులు మార్చి కృత్రిమమైన బాధతో అపాలజీ చెప్తున్నాడు.

నేను అదేమీ పట్టించుకోకుండా రెండు వంద నోట్లు తీసి అతడివైపు విసిరేసి వెనక్కి తిరిగాను.

తన పని పూర్తయి పోయినట్టుగా బయటకు వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతున్న నారాయణనను ఆపి, ఆప్యాయంగా అతడి భుజం చుట్టూ చేయి వేసి నేను ఎంచుకున్న లక్ష్యం వైపు అతడితో కలిసి స్థిరంగా అడుగులు వేశాను. సరిగ్గా ఆ మరుసటి రోజే మద్యనిషేధం వార్త పేపర్లో తాటికాయంత అక్షరాలతో కనిపించింది. వార్త చదివి తృప్తిగా నిట్టూర్పు విడిచాను.